క్లుప్తంగా

బీఆర్ఎస్ నేతలను నిలదీయండి

ఆర్మూర్: అబద్ధపు హామీలతో ప్రజలను మరో మారు మోసం చేయడానికి వార్డుల్లో పర్యటిస్తున్న బీఆర్ఎస్ నాయకులను నిలదీయాలని సీపీఐ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు కోరారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికార పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఒక్కరికీ 'డబుల్ ఇళ్లు' ఇవ్వలేదు



ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్మూర్ నియోజక వర్గంలో ఏ ఒక్కరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోల వెంకటేష్ ఆరోపించారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తికాకముందే దరఖాస్తులు తీసుకొని ప్రజలను మభ్యపెడుతున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు అజ్జు, జిమ్మిరవి, పోశెట్టి, శంకర్, బాలకిషన్, పాషా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగించాలి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, నిర్మాణం తొలగించాలని బీజేపీ జిల్లా ఓబీసీ అధ్యక్షుడు యమాద్రి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ హయుమ్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు, పాన్‌శీను, కలిగోట ప్రశాంత్, ఖాందేష్ ప్రశాంత్, కృష్ణగౌడ్, ఆర్ రాజేశ్వర్‌లు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



రెంజల్(బోధన్): గత ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐపీకేఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం వారు తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాంచందర్‌కు వినతిపత్రం అందించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని, రోజువారి కూలీ రూ. 600 చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘ ప్రతినిధులు గుమ్ముల గంగాధర్, పుట్టి నాగన్న, నసీర్, ఒడ్డెన్న, రాజేశ్వర్, పెద్దలు, గంగాధర్, గోపాల్, పోశెట్టి, సుదర్శన్, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి



వర్ని: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బడిలో మూత్రశాలలు లేవని, వాటిని నిర్మించే వరకు పాఠశాలను మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం తహసీల్దార్ విఠల్, ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంఈవో శాంత కుమారికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. 200 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో బాత్రూంలు లేకపోవడం వల్ల ఆడపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు దొరబాబు, శంకర్, నాయకులు రమేష్, లచ్చాగౌడ్, ప్రవీణ్, గంగాధర్ పాల్గొన్నారు.

విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలి



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని ఆర్మూర్ కోర్టు ఆవరణలో శనివారం లీగల్ అవేర్నస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. రోటరీ, లయన్స్, క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్, ఇతర సామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సరసం చిన్నరెడ్డి, ఏజీపీ నరేందర్, పీపీ అవారి రమేష్, సీనియర్ న్యాయవాదులు భూపతిరెడ్డి, సదానంద, శ్రీధర్, జగన్, సుకేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వారు వచ్చిందే వేళా..?

- బాల్కొండ ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులో ఉండని వైద్యులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



వైద్యుల కోసం ఎదురుచూస్తున్న రోగులు



బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు వచ్చిందే వేళా అన్నట్లు ఉంది. 24 గంటలు వైద్యసేవాలు అందించాల్సిన ఈ క్లస్టర్ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతోపాటు, కనీసం సమయానికి కూడ రాకపోవడంపై ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం పదిగంటలకు కూడా వైద్యులు రాకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిని వైద్యా విధాన పరిషత్‌కు అప్పగిస్తే మరింత మార్పు చెందుతుందని భావించిన ప్రజలకు నిరాశే మిగులుతుంది. ఆస్పత్రిలో మార్పు కార్యక్రమంలో భాగంగా కాన్పులు కూడ చేపట్టాలి. కాని ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవాలకు భయపడి ఆస్పత్రికి కాన్పుల కోసం రావాడానికి జంకుతున్నారు.

ఆస్పత్రిలో బెడ్లు ఖాళీ..

బాల్కొండ ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవాలు అందించడం పక్కన బెడితే, ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు, ఇతర వ్యాధులకు సంబంధించి వచ్చిన వారిని ప్రయివేటు ఆస్పత్రిలోకి వెళ్లాలని ఇక్కడి సిబ్బంది ఉచిత సలహాలు ఇస్తున్నారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన ఓ గర్భిణీ కుటుంబ సభ్యులకు ఆర్మూర్ పట్టణంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లాలని సిబ్బంది సూచించడం గమనార్హం. దీంతో ఆస్పత్రికి రావాలంటే ప్రజలు జంకుతున్నారు. ఆస్పత్రిలో ముగ్గురు వైద్యులు విధులు నిర్వహిస్తుండగా, ఎవరూ కూడా సమయానికి రావడం లేదు. ఉన్న సిబ్బంది ఉచిత సలహాలు ఇస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆస్పత్రిలో ఇన్ పేషంట్లు, బాలింతలు లేకపోవడంతో బెడ్లన్నీ ఖాళీగా ఉంటున్నాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో ఒక్క బాలింత కూడ లేదంటే కాన్పులు ఎలా చేపడుతున్నారో తెలుస్తుంది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండి, సరైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేట్‌కు వెళ్లమంటున్నారు..

గత వారం రోజుల క్రితం బాల్కొండ ప్రభుత్వాస్పత్రికి కాన్పు కోసం తీసుకుని వస్తే ఇక్కడి సిబ్బంది ఆర్మూర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లమని చెప్పారు. అయినా నేను ఆర్మూర్‌లోని సర్కార్ దవాఖానాకు తీసుకెళ్లాను. ఇక్కడ వైద్యులు సమయానికి రావడం లేదు.

– దికొండ సత్యనారాయణ, బాల్కొండ వాసి

వైద్య సిబ్బందిని హెచ్చరించాం..

బాల్కొండ ఆస్పత్రిలో సమయ పాలన పాటించాలని సిబ్బందికి, వైద్యులకు హెచ్చరించాం. ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలను అందిస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలని సిబ్బంది ఎవరూ సూచించలేదు.

– డాక్టర్ అనిల్, వైద్యాధికారి, బాల్కొండ

అభివృద్ధిని చూసి ఆదరించండి

- ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి మూడో పర్యాయం తనను ఆదరించాలని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి కోరారు. ఆర్మూర్‌లోని 18వ వార్డులో నమస్తే నవనాథపురం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని కాలనీల్లో ఆయన ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంట ఉన్న కౌన్సిలర్, మున్సిపల్ సిబ్బందికి వాటిని పరిష్కరించాలని అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వార్డు ప్రజలనుద్దేశించి మాట్లాడారు. పట్టణంలో రూ. 70కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. పెండింగ్ పనులను సైతం త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. దూదేకుల కాలనీ, వడ్డెర సంఘం, ఎరుకుల సంఘానికి భవన నిర్మాణాలకు ఐదు లక్షల రూపాయలను మంజూరు చేస్తూ ప్రొసీడింగ్‌లను అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, వైస్ చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్ వనం శేఖర్, న్యాయవాది శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'బీజేపీ ఇంటింటి ప్రచారం'





డొంకేశ్వర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు.. చిక్కడపల్లి గ్రామంలో..

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలం కేంద్రంలో శనివారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు సురేందర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రచారం చేస్తూ ప్రజలకు వివరిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు సాగర్, స్వామి, చిన్నా ఉన్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆచన్‌పల్లిలో భారతీయ జనతా పార్టీ నేతలు ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్, అగ్నివేశ్, నగేష్, శ్రీనులు పాల్గొన్నారు.



బోధన్ పట్టణంలో..

రుద్రూర్ మండలంలో..

రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లి గ్రామంలో శనివారం బీజేపీ నేతలు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గూర్చి ప్రజలకు వివరించారు. నాయకులు తోట శంకర్, రాజేష్, కన్నె శ్రీనివాస్, కృష్ణ, రాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయాలి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ప్రదీప్

ఆర్మూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ప్రదీప్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా కార్యాలయంలోని కుమార్ నారాయణ భవన్‌లో శనివారం పీవైఎల్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఉద్యోగాల నోటిఫికేషన్, నిరుద్యోగ యువతకు జీవన భృతిని అందిస్తామని హామీలు గుప్పించి నిరుద్యోగులను మోసం చేసారని ఆరోపించారు. పెరుగుతున్న నిత్యావసర ధరలను నియంత్రించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాల్లో 12 రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా అందించాలని డిమాండ్‌తో వచ్చే నెల 3న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు కిషన్, నాయకులు సృజన్, సాయిలు, గంగాధర్, భోజేందర్, రవి, యూ రవి, మోహన్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

- వైభవంగా జగన్నాథ రథయాత్ర



బాల్కొండ: మండల కేంద్రంలో వైభవంగా జగన్నాథ రథయాత్ర శనివారం నిర్వహించారు. మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం నుంచి ఎంకే గార్డెన్ వరకు నిర్వహించారు. ఈసందర్భగా ఇస్కాన్ ఆధ్వర్యంలో హరే రామా, హరే కృష్ణ సంకీర్తనలు ఆలపించారు. రథయాత్రలో చిన్నారులు చేపట్టిన నృత్యాలు అకట్టుకున్నాయి. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి 56 రకాల నైవేద్యాలను నివేదించారు.



- ఘనంగా 'మాయల మర్రి' వార్షికోత్సవం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో మాయల మర్రిగా ప్రసిద్ధి చెందిన పడిలేచిన మర్రి చెట్టు 19వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ఉదయాన్నే పవిత్ర గోదావరి జలాలతో లింగాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ప్రాంగాణంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.



రైతులను మోసం చేస్తున్న కేసీఆర్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వర్ని: కాళేశ్వరం కొండపోచమ్మ ద్వారా నిజాంసాగర్‌లోకి నీళ్లు తీసుకొచ్చామని సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సమావేశాలు పెట్టి రైతులను మోసం చేస్తున్నారని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు పిసిసి డెలిగేట్ ఎలమంచిలి శ్రీనివాస రావు పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టులోకి బొట్టు నీటిని కూడా ఎందుకు తీసుకురావడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో ఐదు టీఎంసీల నీరు నిల్వ ఉండగా మరో ఐదు టీఎంసీల నీరు రైతాంగానికి అవసరం పడుతుందని వాటిని సాగర్లోకి ఎప్పుడు తీసుకు వస్తారని ప్రశ్నించారు. బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని చందూర్, జాకోర లిఫ్టులతోపాటు సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని, వాటిని పూర్తి చేసి రైతులకు నీటిని ఎప్పుడు అందిస్తారని ప్రశ్నించారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొంది రైతులకు మద్దతు ధర 2200లతో పాటు మరో రూ.500లు కలిపి చెల్లిస్తుందని వెల్లడించారు. నాయకులు సురేష్‌బాబా, ఉపాధ్యక్షుడు రెడ్డి రాంబాబు, మండల యూత్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వినోద్, నాయకులు గంగప్ప, నారాగౌడ్, చంద్రదత్తు, దయానంద్, పిర్యనాయక్ ఉన్నారు.

బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం



ఎర్రకుంట రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

నవీపేట/బోధన్: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని అభంగపట్నం శివారులోని ఎర్రగుంట రిజర్వాయర్, కోస్లి శివారులోని అలీసాగర్ ఎత్తిపోతల పథకాలను ఆయన శనివారం సందర్శించారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. అభివృద్ధి పథకాలపై దృష్టిసారించని రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం తెలంగాణ రైతులకు సాగునీరు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టించిన ప్రాజెక్టుల వల్లనేనని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు ఏమి లేదన్నారు. ఏమి అభివృద్ధి జరుగకున్నా జరిగినట్టు చూపించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనంతో దశాబ్ది ఉత్సావాల జరుపుకోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన సాగునీటి పథకాలపై చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, జిల్లా నాయకులు తాహేర్ బిన్ హందాన్, మండల నాయకులు మోస్రా సాయి రెడ్డి, సుధాకర్‌రావు, నాగేష్‌రెడ్డి, ముప్పా గంగారెడ్డి, పులి శ్రీనివాస్, మోబిన్ ఖాన్, పాషా మోహినుద్దీన్‌లు పాల్గొన్నారు.

సమాచారం..

- నేడు ఉచిత వైద్యశిబిరం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఐఎంఏ ఆర్మూర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఐఎంఏ కార్యదర్శి భానురాంగిరి ఒక ప్రకటనలో తెలిపారు. అంకాపూర్, ఆక్లూర్, ఆలూర్, పిప్రి, పడగల్, బడా భీంగల్ గ్రామాల్లో నేడు వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దళితబంధులో మాలలకు ప్రాధాన్యం ఇవ్వాలి



సాటాపూర్‌లో మాట్లాడుతున్న ఆనంపల్లి ఎల్లయ్య

రెంజల్(బోధన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దళితబంధు పథకంలో మాలలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు ఆనంపల్లి ఎల్లయ్య కోరారు. మండలంలోని సాటాపూర్ గ్రామంలో శనివారం సంఘ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. దళితుల్లో జనాభా ప్రాతిపదికన పథకాలను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. మాలల ఐక్యతను చాటేందుకు మాలల సింహగర్జన, 'హలో మాల ఛలో నిజామాబాద్' కార్యక్రమాలను త్వరలో నిర్వహించనున్నట్లు వివరించారు. మండల మాల మహానాడు నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాందాస్, ప్రధాన కార్యదర్శిగా కిరణ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గైని రవి, కోశాధికారిగా రమేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల కిష్టయ్య, కోశాధికారి రాజేంద్రయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి రవీంద్రబాబు పాల్గొన్నారు.

నందిపేటకు నిధులు మంజూరు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట పట్టణ సుందరీకరణలో భాగంగా ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించారు. నందిపేటలో రోడ్డు డ్రైయినేజీల నిర్మాణానికి రూ. 5.5కోట్లు, కమ్యూనిటీ భవనాలు, అలయాలు, ప్రార్థన మందిరాల కోసం రూ. 1.51 కోట్లు, ఆర్మూర్ బైపాస్ మరమ్మతులకు రూ. 1.55 కోట్లు, పాఠశాల అభివృద్ధికి రూ. 1.10కోట్లు, ఫంక్షన్‌హాళ్ల నిర్మాణం కోసం రూ.2.25కోట్ల నిధులు కేటాయించారు. త్వరలో నమస్తే నందిపేట కార్యక్రమం నిర్వహించి రూ. 11.46 కోట్లు నిధులకు సంబంధించి మంజూరు పత్రాలు, శంకుస్థాపనలు చేపట్టనున్నట్లు ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధికి దూరంగా ఆర్మూర్



నందిపేట్(ఆర్మూర్): ఆర్మూర్ నియోజవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి ఏబీ శ్రీనివాస్ విమర్శించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి మంద మహిపాల్, పెంట ఇంద్రుడు, వైఎస్ గంగాధర్, బైండ్ల ప్రశాంత్, భూమేష్‌రెడ్డి, ఫరీద్, దేవిదాస్‌గౌడ్, పీరాజీ నాగరాజ్, సంజీవ్, ఎర్రొల్లరవి, సాయన్న, గంగారెడ్డి, మగ్గిడిశ్రీను పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఆదిపురుష్ (3డీ-తెలుగు) - 3.10 ది ఫ్లాష్ - 12.00, 6.55, 10.05
స్క్రీన్-2 –	ఆదిపురుష్ (3డీ-తెలుగు) - 8.00, 11.45, 3.30, 7.15, 11.00
స్క్రీన్-3 –	1920 హర్రర్స్ ఆఫ్ ది(తెలుగు)-10.55 9.50 అశ్విన్స్(తెలుగు) -1.40 7.20
స్క్రీన్-4 –	ది ఫ్లాష్(తెలుగు)-4.10 భీమదేవరపల్లి(తెలుగు)-12.40 6.20 9.15 1920 హర్రర్స్ ఆఫ్ ది(తెలుగు)-3.35

సంక్షిప్తం

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాల పంపిణీ

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శెట్‌పల్లి చెందిన కరుణ ట్రస్టు ఆధ్వర్యంలో బ్యాగులు, నోటుపుస్తకాలు, పెన్నులు, వాటర్ బాటిల్లను ట్రస్టు అధ్యక్షుడు మహేశ్ అందజేశారు. హెచ్‌ఎం విజయ్, యూటీఎఫ్‌జిల్లా అధ్యక్షుడు రమేశ్, పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలం ఉప్లూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పోతు రాజేశ్వర్ తన పుట్టిన రోజును పురస్కరించుకొని నోట్‌బుక్‌లు వితరణ చేశారు. ఎంపీటీసీ అనిల్, సర్పంచ్ పద్మ పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థికసాయం అందజేత

పెర్కిట్(ఆర్మూర్): క్రీడల్లో రాణిస్తున్న మామిడిపల్లి నలంద హైస్కూల్ పూర్వ విద్యార్థి గరిపల్లి అజయ్ కుమార్‌కు పాఠశాల యాజమాన్యం శనివారం రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. పరుగు పందెంలో ఏడు సార్లు రాష్ట్ర స్థాయి, నాలుగు సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న అజయ్ కుమార్‌కు ఆర్థిక పరిస్థితి బాగా లేదు. దీంతో పాఠశాల యాజమాన్యం తనవంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే ఇజ్రాయిల్ తెలంగాణ అసోసియేషన్ వారు సైతం తమవంతుగా రూ.75 వేలను అందజేశారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

బోధన్: పట్టణంలోని బడులు, కళాశాలలకు వస్తున్న వివిధ గ్రామాల విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ డివిజన్ అధ్యక్షుడు మీసాలే నాగేష్, నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం ఆర్టీసీ డీఎం టీఎన్ స్వామికి వినతి పత్రం అందించారు.

దూపల్లిలో అంగన్‌వాడి బాట

రెంజల్(బోధన్): మండలంలోని దూపల్లి గ్రామంలో శనివారం అంగన్‌వాడి బాట నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి తెలిపారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతు చిన్నారులను కేంద్రాల్లో చేర్పించినట్లు వివరించారు.

బాల్కొండ 'లయన్స్ క్లబ్'కు అవార్డులు

బాల్కొండ: లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండకు రాష్ట్ర స్థాయిలో అవార్డులు లభించాయి. చాకు లింగంకు ఉత్తమ జిల్లా చైర్మన్, విక్రమ్‌కు ఉత్తమ అధ్యక్షుడిగా, సాగర్ రెడ్డి, పెండెం జీవన్‌లకు ఉత్తమ సేవ అవార్డులను శనివారం లయన్స్ గవర్నర్ శ్రీనివాస్ అందజేశారు. లయన్స్ క్లబ్ బాల్కొండ నూతన అధ్యక్షుడిగా సాగర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా పెండెం జీవన్, కోశాధికారిగా చాకులింగం ఎన్నికైనట్లు అంజయ్య తెలిపారు.

రుణాలను రికవరీ చేయాలి

బాల్కొండ: మహిళా సమాఖ్య సభ్యులు పొందిన బ్యాంకు రుణాలను నూరు శాతం రికవరీ చేయాలని స్త్రీనిధి మేనేజర్ మురళి కృష్ణ అన్నారు. ముప్కాల్‌లో శనివారం స్త్రీనిధి మండల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన డిజిటల్ డాక్యుమెంటేషన్ విధానంపై అవగాహన కల్పించారు. బ్యాంకు రుణాలు రూ.16.28 కోట్ల లక్ష్యం ఉందన్నారు. ఏపీఎం ప్రసాద్‌రావు, సీసీలు, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

రోడ్లపై కేజీవీల్స్ తిరిగితే సీజ్

బాల్కొండ: కేజీవీల్స్ ట్రాక్టర్‌లు రోడ్లపై తిరిగితే ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని బాల్కొండ ఎస్సై గోపి హెచ్చరించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన రైతులకు అవగాహన కల్పించారు. కేజీవీల్స్‌కు పట్టీలు వేసుకోవాలని, లేదంటే ఇతర వాహనాల్లో షిఫ్టింగ్ చేసి, పొలాలకు తీసుకెళ్లాలన్నారు.